ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ.18.12.2024 సమయం : 1310 గంటలు

ముఖ్యాంశాలు

1. ధరణి పోర్టల్ స్థానంలో తీసుకొస్తున్న తెలంగాణ భూభారతి బిల్లును రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఈ రోజు శాసనసభలో ప్రవేశ పెట్టారు.
2. వైద్య కళాశాలల్లో ప్రవేశాలకు సంబంధించి హైకోర్టు తీర్పును క్షుణ్ణంగా పరిశీలించి, స్థానిక విద్యార్థులకు పీజీ సీట్లు దక్కేలా చర్యలు తీసుకోనున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ తెలిపారు.
3. రాష్ట్రంలో పోలీసులకు అమలు చేస్తున్న వైద్య, ఆరోగ్య సేవలను హోంగార్డులకు కూడా వర్తింప చేస్తామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శాసనమండలిలో ప్రకటించారు.
4. దేశంలోని భాషలు మన సంస్కృతికి, జ్ఞాన సంపదకు చిహ్నాలు అని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి అన్నారు.

భూభారతి బిల్లు

శాసనసభలో తెలంగాణ భూభారతి సవరణ బిల్లును రెవెన్యూ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఈ రోజు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సామాన్యుల భూములు కాపాడే బాధ్యత ప్రభుత్వానిదే అని అన్నారు. కానీ గత ప్రభుత్వం దాన్ని విస్మరించిందని విమర్శించారు. గత BRS ప్రభుత్వం తెచ్చిన ROR చట్టం 2020 ద్వారా వచ్చిన ధరణి పోర్టల్ వల్ల ఎదురైన సమస్యలను పరిష్కరించేందుకు భూభారతి బిల్లును తీసుకొచ్చామని తెలిపారు. ఈ బిల్లు విషయంలో విపక్షం సూచనలను కూడా పరిగణనలోకి తీసుకున్నామన్నారు. ఎన్నికల ముందు ధరణిని బంగాళాఖాతంలో పడేస్తామని చెప్పామని, ఇప్పుడు ఆ మాటను నిలబెట్టుకున్నామని తెలిపారు. లోపభూయిష్టంగా ఉన్న ROR చట్టం 2020ను పూర్తిగా ప్రక్షాళన చేసి భూభారతి బిల్లు తీసుకువచ్చినట్టు తెలిపారు. అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు ధరణి వల్ల ఎదురైన కష్టాలను తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు ప్రత్యేకంగా కమిటీ ఏర్పాటు చేశామని, వివిధ రాష్ట్రాల్లో అమలు చేస్తున్న రెవెన్యూ చట్టాలను పరిశీలించామని తెలిపారు. ఈ ఏడాది ఆగస్టులో జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో భూభారతి బిల్లును ప్రవేశపెట్టి లఘు చర్చ చేశామని, అదే రోజు సీసీఎల్ఐ వెబ్సైట్లో 45 రోజుల పాటు ముసాయిదా బిల్లును ఉంచి మేధావులు, ప్రజల అభిప్రాయాలను, సూచనలు స్వీకరించామని వెల్లడించారు.

డెస్క్

దామోదర రాజనర్సింహ

వైద్య పీజీ కళాశాలల్లో ప్రవేశాలకు సంబంధించి కోర్టు వెలువరించిన తీర్పును క్షుణ్ణంగా పరిశీలించి, స్థానిక విద్యార్థులకే సీట్లు దక్కేలా చర్యలు తీసుకోనున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ

మంత్రి దామోదర రాజనరసింహ స్పష్టం చేశారు. ఈ మేరకు మంత్రి కార్యాలయం ఈ ఉదయం ఒక ప్రకటన విడుదల చేసింది. రాష్ట్రంలోని వైద్య కళాశాలల్లో 15 శాతం అన్ రిజర్వుడు కోటాలో చదివిన స్థానికేతర విద్యార్థులను, పీజీ అడ్మిషన్లలో స్థానిక కోటాగా పరిగణించకుండా రాష్ట్ర విద్యార్థులకు ప్రయోజనం కల్పించేలా ప్రభుత్వ ఆదేశాలు ఇచ్చినట్లు మంత్రి చెప్పారు. తెలంగాణ విద్యార్థులకు ప్రయోజనం కల్పించేలా జీవో 148, 149 తీసుకొచ్చామని చెప్పారు. ఈ మార్పు తెలంగాణ విద్యార్థులకు న్యాయం చేయడానికే తప్ప, వారికి నష్టం చేసేందుకు కాదని అన్నారు. కోర్టు తీర్పును కొందరు ఉద్దేశ్యపూర్వకంగా వక్రీకరిస్తున్నారని, ఇలాంటి తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దని రాష్ట్ర విద్యార్థులకు, తల్లిదండ్రులకు మంత్రి విజ్ఞప్తి చేశారు.

పీటీసీ సంగారెడ్డి

రాష్ట్రపతి :

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాష్ట్రపతి నిలయంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. రాష్ట్రపతి ఐదు రోజుల శీతాకాల విడిదిలో భాగంగా ఈరోజు రాష్ట్రపతి నిలయంలో రెండవ రోజు ఫెసిలిటేషన్ సెంటర్, గార్డెన్స్ అండ్ గ్రీన్ స్పేస్ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. వాలంటీర్స్ కేంద్రాన్ని, అలాగే వైద్య శిబిరాన్ని రాష్ట్రపతి సందర్శించారు.

ఎమ్.ఎస్.ఎమ్.

CDM

సికింద్రాబాద్ లోని ప్రతిష్టాత్మక కాలేజ్ ఆఫ్ డిఫెన్స్ మేనేజ్ మెంట్ - CDM దశాబ్దాలుగా ఉన్నత శ్రేణి సంస్థగా ఎదిగిందని, ఎల్లుండి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మూ సంస్థకు "రాష్ట్రపతి కలర్స్" ను ప్రదానం చేస్తారని కళాశాల కమాండెంట్ మేజర్ జనరల్ హర్ష్ ఛిబ్బర్ చెప్పారు. ఈ ఉదయం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, 1970 లో ఏర్పాటయిన CDM ప్రస్తుతం

జాతీయ అంతర్జాతీయ సంస్థలతో కలసి పనిచేస్తూ రక్షణ దళాల ఉన్నతాధికారులకు వ్యూహాత్మక మేనేజ్ మెంట్ లో నైపుణ్యాలను అందిస్తోందని చెప్పారు.

ఎంఎస్ఎల్

పోలీసులు పొన్నం ప్రభాకర్

రాష్ట్రంలో పోలీసు సిబ్బందికి అమలు చేస్తున్న వైద్య, ఆరోగ్య సేవలను హోంగార్డులకు కూడా వర్తింప చేస్తామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శాసనమండలిలో ప్రకటించారు. పోలీసుల ఆరోగ్యపరమైన అంశాలు ప్రభుత్వ బాధ్యత అని వారికి ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స నిరాకరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆర్టీసీలో అమలు చేస్తున్నట్టుగానే బీమా పథకాన్ని హోం శాఖలో కూడా అమలు చేస్తామన్నారు. హోం శాఖలో ఎవరైనా ప్రమాదానికి గురై మరణిస్తే కోటి రూపాయలకు పైగా బీమా వచ్చేలా చేస్తామన్నారు. ఆరోగ్య శ్రీ పరిమితిని 5 లక్షల రూపాయల నుంచి 10 లక్షల రూపాయలకు పెంచామని తెలిపారు.

డెస్క్

ఆటో డ్రైవర్లు తీర్మానం

ఆటో డ్రైవర్లను BRS పార్టీ మోసం చేస్తోందని శాసనసభా వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు ఒకలా, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరోలా వ్యవహరిస్తోందని అన్నారు. రాష్ట్రంలో ఆటో డ్రైవర్ల సమస్యలపై అసెంబ్లీలో BRS పార్టీ వాయిదా తీర్మానంపై చర్చ సందర్భంగా మంత్రి  ఈ వ్యాఖ్యలు చేశారు.

ఇదే విషయంపై మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క సైతం స్పందించారు. పేద మహిళలకు ఉచిత బస్సు సదుపాయం కల్పించవద్దా అని ప్రశ్నించారు.

బైక్ డ్రాపింగ్, క్యాబ్ సర్వీసులను గత ప్రభుత్వమే ప్రోత్సహించి ఆటో డ్రైవర్లకు అన్యాయం చేసిందని విమర్శించారు.

అంతకు ముందు ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ BRS ఎమ్మెల్యేలు ఖాకీ చొక్కాలతో అసెంబ్లీకి హాజరయ్యారు. 93 మంది ఆటో డ్రైవర్ల మరణానికి ప్రభుత్వమే కారణమని BRS కార్యనిర్వాహక అధ్యక్షుడు తారకరామారావు ఆరోపించారు.

డెస్క్

ఆటో డ్రైవర్లు - పొన్నం

కాగా, BRS పార్టీ ఆటో కార్మికుల సమస్యలపై మొసలి కన్నీరు కారుస్తోందని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. ఆ పార్టీ అధికారంలో ఉన్న పదేళ్లలో ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం ఎలాంటి చర్యలు తీసుకుందో చెప్పాలని కోరారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం వల్ల ఆటో సర్వీసులపై ప్రభావం పడుతుందని ప్రచారం చేయడం తప్పని అన్నారు.

డెస్క్

ఛలో రాజ్ భవన్

అదానీపై జేపీసీ విచారణ, మణిపూర్ లో శాంతి భద్రతల పరిరక్షణ విషయంలో కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా టీపీసీసీ ఛలో రాజ్ భవన్ కార్యక్రమం చేపట్టింది. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు పాల్గొన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

డెస్క్

మాదక ద్రవ్యాలు

మాదక ద్రవ్యాలు, ఇతర కేసులతో సంబంధమున్న సినీ, రాజకీయ ప్రముఖులను వదిలేదిలేదని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. శాసన మండలిలో ఈరోజు డ్రగ్స్, హుక్కా సెంటర్లు తదితర వాటిపై ఎమ్మెల్సీలు బలుమురి వెంకట్ , ms ప్రభాకర్ రావు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. హుక్కా సెంటర్లను నిషేధిస్తూ ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయం తీసుకుందని మంత్రి తెలిపారు. C2PA సెంట్రల్ యాక్ట్ పై ఇప్పటికే రాష్ట్రపతికి పంపించామని అన్నారు. హైకోర్టు అనుమతితో రాష్ట్రంలో 12 హుక్కా కేంద్రాలు నడుస్తున్నాయని తెలిపారు.

పీఎన్

ప్రశ్నోత్తరాలు

తెలంగాణ అసెంబ్లీ సమావేశాల నాలుగో రోజులో భాగంగా ప్రశ్నోత్తరాల సమయంలో... విద్యార్థులకు విదేశీ విద్య ఉపకార వేతనాల అంశంపై... శాసనసభ్యులు టీ వివేకానంద్, మర్రి రాజశేఖర్ రెడ్డి, అనిల్ యాదవ్ ప్రశ్నించారు. ఈ ప్రశ్నలకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖా మంత్రి ధనసరి అనసూయ సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా సభలో మాట్లాడుతూ ఈ పథకంలో గత ప్రభుత్వం 254 కోట్ల రూపాయల బకాయిలు పెట్టిందని, 2024 - 25 నాటికి 1098 మంది విద్యార్థులకు 140 కోట్ల 74 లక్షల బకాయిలు తమ ప్రభుత్వం చెల్లించింది అన్నారు.

(HYD -PTC)

అమృత్ 2.0

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న అమృత్-2.0 పట్టణ పథకానికి సిరిసిల్ల పట్టణం ఎంపికైందని, సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ దుబ్బాక లావణ్య ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలో డిజిటల్ డ్రోన్ ద్వారా సర్వే చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. పట్టణ సమగ్రాభివృద్ధి కోసం సర్వే ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నూతన మాస్టర్ ప్లాన్ రూపొందించడానికి ఈనెల 31వరకు డిజిటల్ డ్రోన్ సర్వే చేపడుతామని తెలిపారు.

పిటిసి, రాజన్న సిరిసిల్ల జిల్లా

కిషన్ రెడ్డి

ప్రాంతీయ భాషలను ప్రోత్సహించేందుకు కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం కృతనిశ్చయంతో పనిచేస్తోందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఈ రోజు హైదరాబాద్‌లో జరిగిన మీడియా సమావేశంలో కేంద్ర మంత్రి మాట్లాడుతూ భిన్న సంస్కృతులు, భాషలతో వైవిధ్యం నిండిన దేశం భారత్ అని అన్నారు. దేశంలో మొత్తం 121 భాషలు ఉన్నాయని తెలిపారు. గతంలో అధికార గుర్తింపు పొందిన భాషలు 14 ఉంటే, నరేంద్ర మోదీ హయాంలో ఆ సంఖ్య 21 కి పెరిగిందని వెల్లడించారు. ఈ భాషలు మన సంస్కృతికి, జ్ఞాన సంపదకు చిహ్నాలు అని అభిప్రాయపడ్డారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ 2020లో ప్రవేశపెట్టిన నూతన జాతీయ విద్యావిధానం ద్వారా ప్రాంతీయ భాషల్లో విద్యను అభ్యసించే అవకాశం విద్యార్థులకు లభించిందని అన్నారు. ఆరంభంలో దీన్ని విమర్శించినవారే ఇప్పుడు సమర్థిస్తున్నారని తెలిపారు.

పీఎన్

ఫ్లోరోసిస్ సర్వే

నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలో ఫ్లోరోసిస్ పై సర్వే చేపట్టనున్నామని జిల్లా వైద్యాధికారి పుట్ల శ్రీనివాస్ తెలి పారు. మర్రిగూడ ప్రభుత్వ ఆసుపత్రిలో ఫ్లోరోసిస్ సర్వేపై సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ప్రతి ఇంటికి వైద్య సిబ్బంది వెళ్లి ఫ్లోరోసిస్ వ్యాధి తీవ్రతను గుర్తించి బాధితుల వివరాలను నమోదు చేస్తారని, సర్వే అనంతరం పూర్తి నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామని తెలిపారు.

పీటీసీ, నల్లగొండ

జాతీయ పురస్కారం.

సేంద్రీయ పద్ధతిలో సమీకృత సాగు చేస్తున్న నిర్మల్ జిల్లా కొండాపూర్ కు చెందిన గణపతి మహిళా సంఘానికి జాతీయ పురస్కారం లభించింది. ప్రఖ్యాత పెప్సికో సంస్థ జాతీయస్థాయిలో నిర్వహించిన రెవల్యూషనరీ ఉమెన్ ఎంపవర్మెంట్ పురస్కారం పోటీల్లో గణపతి మహిళా సంఘం ప్రథమ స్థానం దక్కించుకుంది.

పిటిసి నిర్మల్ జిల్లా.